
# డొక్కు సైకిలు

ఈ మధ్య టైముకు వాకింగు కు అప్పారావు రాలేక పోతుంటే గరుడాచలమే అతని గుమ్మంలో కేక పెట్టాడు ఏదో రకంగా బిజీగా వుంటున్న అతన్ని చూస్తూ వృథా ప్రయాస అనుకున్నాడు.

ఈజీఛైర్‌లో కూర్చుని పేపరు చదువుకుంటున్న గరుడాచలం కెవ్వుమన్న పెద్దకొడుకు గొంతు విని ఏమైందిరా అన్నాడు.

'ఏముందీ తిన్నగా నడవడం అల వాటుందేమిటి మీ సుపుత్రుడికి సైకిల్ తగిలింది కాలికి' అంది.

గాబరా గాలోనికి పరు గెట్టాడు గరుడాచలం.



"దెబ్బలేమీ తగల్లేదు కదా! వెధవది... తుప్పు కూడా పట్టేసింది. సెప్టిక్ గట్రా అవుతుందో... ఏమిటో" అన్నాడు ఆదుర్దాగా.

ఆమె ఏదో అనబోయేంతలో...

"గరుడాచలంగారూ!" అన్న పక్కింటి అప్పారావు గొంతు బయటినుంచి విని పించింది.

"వాకింగుకి వచ్చినట్లున్నారు. దయ చేయండి బయటికి" అంది విసుగ్గా సుమతి.

"వెధవది. అమ్మిపారేద్దామంటే వంద కూడా ఇవ్వనన్నాడు సైకిలు షావు వాడు. ఛ..ఛ. దీనివల్ల ఇంట్లో పీస్ ఆఫ్ మైండ్ లేకుండా పోతోంది" గట్టిగా విసుక్కున్నాడు గరుడాచలం.

"ఏమైంది...?" అన్నాడు అప్పారావు.

"ఏముందన్నయ్యగారూ! రోజూ వుండే పాటే... ఈ డొక్కు సైకిలు ప్రాణాలు తినేస్తోంది. ఉల్లిపాయల వాడు కేజీన్నర ఇస్తానన్నాడు. అదే ఖర్మమో! రెండు.. మూడు రోజుల కోమారైనా, అది ఎవర్నో ఒకర్ని పలక రించడం పరిపాటైపోయింది. చూసి చూసి, నేనే.. ఎప్పుడో రోడ్డు మీదకు గిరాటేస్తాను" అంది సుమతి ఆవేశంగా.

"సార్! మీరేమీ అనుకోనంటే... ఆ సైకిలు నేను తీసుకుంటాను. రేటూ.. అదీ..."

"రేటా.. పాడా..! తెచ్చి మళ్ళీ మాకు అప్పజెప్పకుండా వుంటే చాలు. దయచేసి వెంటనే ఇప్పుడే పట్టుకెళ్ళండి" అంది సుమతి.

గరుడాచలానికీ నిజంగా అలాగే అని పించింది.

అప్పారావు సైకిలు దగ్గరకు నడి చాడు.

బాగా రస్ట్ పట్టి వుందది. నాలుగు స్పోక్స్ పోయాయి. ఒక టైరు పూర్తిగా పోయింది. బ్రేకులు కండిషన్‌లో లేవు. సీటు చిరిగి స్కెలిటన్ మాత్రమే మిగి లింది. పెడల్స్ పోయాయి. 'అంత బాగా' ఎలా పాడుచేశారో!... అతడికి అర్థం కాలేదు.

లేచి చేయి దుమ్ము దులుపుకుం టున్న అతడిని చూస్తూ... మనసులో కొంచెం గాబరా పడ్డాడు గరుడాచలం.

"నే చెప్పలా...! మీరేం చేసుకుంటారు దీన్ని పట్టుకెళ్ళి? నేనే..." అంటున్న సుమతిని మిర్రి మిర్రి చూశాడు గరు డాచలం.

"అబ్బే! అదేం లేదమ్మా. తీసికెడ తాను" అంటూ దానిని మెల్లిగా అతని ఇంటివైపుకు నడిపిస్తూ వుంటే...

'పీడ విరగడైంది' అని సంతోషిం చారు దంపతులు.

* * *

అప్పారావూ, గరుడాచలమూ పక్క పక్క ఇళ్ళ వాళ్ళు. వాకింగులో ఫ్రెండ్‌షిప్ కుదిరింది ఇద్దరికీ. కానీ.. ఇద్దరికీ, నక్కకీ నాగలోకానికీ వున్నంత తేడా వుంది. అప్పారావుది పెంకుటిల్లు. అయితే, గరుడాచలానికిది రెండంత స్తుల భవనం. ఇతడో.. చిన్న గుమస్తా అయితే, అతడో పెద్ద ఆఫీసరు. ఇద్దరికీ ఇద్దరేసి మగ సంతానాలే అయినప్పటికీ, గరుడాచలం పిల్లలు స్కూటర్ల మీద కాన్వెంటుకి వెడితే, అప్పారావు పిల్లలు నడిచి గవర్నమెంట్ స్కూళ్ళకి వెడు తున్నారు.

* * *

మేడమీద గదులన్నీ తుడిపించి, తాళాలు వేసి బయటికి వస్తున్న సుమతి దృష్టిలో సైకిల్‌ని కిరసనాయి ల్‌తో తుడుస్తున్న అప్పారావు పిల్లలు పడ్డారు.

అది గరుడాచలానికి టిఫెన్ పెడుతూ చెప్పిందామె.

"ఇంకా అదేదో బాగుపడుతుందని వాడికి ఆశగా వుందంటావ్" ముసిము సిగా నవ్వుతూ అన్నాడు గరుడాచలం.

"మరే... మరే..." అంది సుమతి.


* * *

ఈమధ్య టైముకి వాకింగ్‌కి అప్పా రావు రాలేకపోతుంటే గరుడాచలమే అతని గుమ్మంలో కేక పెట్టసాగేడు. రోజూ టైర్లు బిగుస్తూనో... పెయింట్ చేస్తూనో... ఏదో ఒక రకంగా బిజీగా వుంటున్న అతడిని చూస్తూ...

'ఏమిటో వృథా ప్రయాస పడుతు న్నారు' అనేవాడు గరుడాచలం.

నవ్వి ఊరుకునేవాడు అప్పారావు.

## న్యూజెర్సీ కళాసమితి, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక సంయుక్తంగా నిర్వహించిన 97 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



* * *

స్కూటర్ మీద బజారుకి బయల్దేరిన సుమతికీ, గరుడాచలానికీ అప్పారావు కొడుకు రమేష్ సైకిల్‌మీద జోరుగా వెడుతూ కనిపించాడు.

"అది మన సైకిలే! మొత్తానికి అప్పారావు ఘటికుడేనండోయ్. అయినా మనకోమాట చెప్పవచ్చుగా, బాగు చేసుకున్నామని" అంది సుమతి అక్కసుగా.

నిజమేననిపించింది గరుడాచలానికి.

వీళ్ళు ఇంటికి వచ్చేసరికి ఓ డజను అరటిపళ్ళు పెట్టుకుని సైకిలు పట్టుకుని నిలబడి వున్నాడు రమేష్.

"నాన్నగారు మీకు సైకిలు చూపించి, ఇవి మీకు ఇచ్చి రమ్మన్నారండీ" అన్నాడు.

"ఎందుకోయ్. ఇవన్నీ.. మొత్తానికి దీన్ని పంచకల్యాణిలా చేశారే మీ నాన్న. బాగుంది" అన్నారు దంపతులిద్దరూ.

ఇద్దరికీ మనసులో ఏదో వెలితిగా అనిపించింది సడన్‌గా.

ఆటుపైని ఆ వీధిలో వాళ్ళు సైకిల్ జోరుగా తొక్కినప్పుడల్లా దాన్ని అలవగొడుతున్నట్టు, మెల్లిగా తొక్కినప్పుడల్లా వాళ్ళ బరువు అది మొయ్యలేక మొయ్యలేక మోస్తున్నట్టు ఫీలయ్యేది సుమతి. గరుడాచలానికి చెప్తే...

"అలాగే!.. నిజమే సుమీ" అంటూ అతడు వంత పాడేవాడు.

* * *

సుమతి దృష్టిలో అప్పారావూ, పిల్లలూ కలిసి ఎక్కడికో సైకిలుమీద వెళ్ళడం పడింది.

ఆమె మనసు అదోమాదిరిగా అయిపోయింది.

గరుడాచలానికి కంచంలో అన్నం పెడుతూ...

"అప్పారావూ, ఇద్దరు పిల్లలూ పైసా ఖర్చు లేకుండా మన సైకిలుమీద ఎక్కడికో పోతున్నారు" అంది.

దాని కతడేమీ సమాధానం చెప్పలేదు

"ఏమిటలాగ, బెల్లం కొట్టిన రాయిలాగా మాట్లాడరు? ఏదో ఒకళ్ళూ, చిన్నపిల్లలైతే ఇద్దరూ దానిమీద వెళ్ళొచ్చును కానీ, అలాగ అందరూ స్వారీ చేస్తే విరిగిపోదూ పుటుక్కునా" అంది అక్కసుగా.

"మరే.. అయినా.. మనకెందుకు? వాళ్ళ పాట్లేవో.. వాళ్ళే పడతారులే" అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

అతడికి మరేం చెప్పాలో తెలియలేదు.

* * *

రాజా, రవీ చెరో స్కూటర్ మీద, వాళ్ళ వాళ్ళ ఫ్రెండ్స్ ఇళ్ళకి వెళ్ళిపోయారు.

బజారునుంచి పన్నీర్ తెమ్మంది సుమతి.

పేంటూ, షర్టూ తగిలించుకుని కూర్చున్నాడు గరుడాచలం.

"ఏమిటలా కూర్చున్నారు?" అంది సుమతి.

"మరేం చెయ్యమంటావ్. ఏ వెధవైనా వస్తాడేమోనని చూస్తున్నా!"

"అప్పారావుని సైకిల్ అడగండీ!"

"ఆ" విభ్రాంతిగా అన్న గరుడాచలం సర్దుకుంటూ...

"ఏమన్నా అనుకుంటాడేమోనే..." అన్నాడు.

"తప్పేం వుందీ. మన సైకిలు మనం తెచ్చుకోవడంలో. స్కూటర్లు వచ్చేస్తే అడగడానికి వుండదు. ఊ..." అని ఆమె అంటుంటే

మెల్లిగా వారింటికి నడిచి, శక్తినంతా కూడగట్టుకుని, ఆయన్ని పిలవబోయేంతలో.. రవి వచ్చేశాడు.

ధుమధుమలాడిపోయింది సుమతి.

"ఏమైంది గరుడాచలంగారూ?" అప్పుడే వచ్చిన అప్పారావు, సైకిలు మీద ఓ కాలూ, కింద ఓ కాలూ పెట్టి అడిగాడు.

ఒంటికి కొత్తావకాయ రాసుకున్నట్టైంది గరుడాచలానికి.

"మా పిల్లలు బళ్ళు రెండూ పట్టుకుపోయారు. సుమతి పన్నీర్ తెమ్మందీ.. ఎలాగా అని చూస్తుంటే రవి వచ్చేశాడు. కానీ ... సైకిల్ మాత్రం జాగ్రత్తగా వాడండీ" అంటూ వెళ్ళిపోయాడు.

విభ్రాంతిగా చూస్తున్న అప్పారావుతో... "మొన్న మీరు ముగ్గురూ సైకిల్ మీద కనబడగానే కొంచెం ఫీలయ్యారండీ అన్నయ్యగారూ! ఆయన... అది వాళ్ళ నాన్నగారి సైకిలట. అందుకూ.. అలాగంటున్నారు" అని సుమతి అంటుంటే, మౌనంగా లోనికి నడిచాడు అప్పారావు.

* * *

"సైక్లింగ్ చేయమంటున్నారు డాక్టరుగారు. వీలౌతుందా?" అంటూ సైకిల్ ఇవ్వమన్నట్టుగా కాకుండా జాగ్రత్తగా అడిగిన గరుడాచలాన్ని ఒక్క క్షణం విభ్రాంతిగా చూసి సైకిల్ తెచ్చిచ్చాడు అప్పారావు.

సైక్లింగ్ కాగానే వాళ్ళ ఇంట్లోకి సైకిల్ నడిపిస్తున్న గరుడాచలాన్ని సాలోచనగా చూశాడు అప్పారావు.

రెండ్రోజులకు యథాస్థానానికి చేరింది సైకిలు.

* * *

"ఏ వస్తువైనా... ఎవరి దగ్గర్నించీ ఊరకే తీసుకోకూడదని ఎరగరూ? ఏదో ఒకటి సెటిల్ చేసుకోండని నేనావాడే చెప్పాను. విన్నారా? దానికి పెట్టిన ఖర్చు ఈ ఆర్నెల్లూ వాడుకున్నదానికి సరిపోతుందని ఆవిడ ఆయన్తో అంటుంటే విన్నాను. నిజమే.. ఇక దాని సంగతి మరచిపోండి" అంది అప్పారావు భార్య శాంత, అతడిని ఊరడిస్తూ.

దానిమీద డబ్బుకన్నా, మరేదో పెట్టినట్టు ఫీల్ అయ్యాడు అప్పారావు.

ఆపై దాని ప్రసక్తి ఎవరూ ఎప్పుడూ ఎత్తలేదు.

**ఉపద్రష్ట కృష్ణప్రియ** ●

●●●

మల్లెపూలు బేరం ఆడుతున్న సుమతి దృష్టిలో అప్పారావూ, పిల్లలూ కలిసి ఎక్కడికో సైకిలు మీద వెళ్ళడం పడింది ఆమె మనసు అదోమాదిరిగా అయిపోయింది.

●●●